కుంగుతున్న వంతెనలు

- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- హై లెవెల్ బ్రిడ్జీలు నిర్మించాలంటున్న ప్రజలు


కుంగి ప్రమాదకరంగా మారిన పాగేరు వంతెన


పెన్నా నదిపై తెగిన కాజ్ వే చూపిస్తున్న రైతులు(ఫైల్)

కమలాపురం : మండలంలోని పలు గ్రామాలు, మండలాలకు అనుసంధానంగా ఉన్న లో లెవెల్ వంతెనలు కుంగుతున్నాయి. నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉన్న ఈ వంతెనలు కుంగడం, తెగడం జరుగుతుండటంతో ప్రయాణికులు, ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాగేరు వంతెన, పెన్నా పై నిర్మించిన కాజ్ వేతో పాటు సి.గోవులాపురం–పాచికలపాడు గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వేలు వరదలు వచ్చినా ప్రతి సారి కోతకు గురవుతున్నాయి. తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు, ప్రయాణికుల రాకపోకలు సాగుతున్నాయి. తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

పాగేరు వంక వస్తే ప్రయాణీకులకు తిప్పలు తప్పవు

కమలాపురం–ఖాజీపేట, చాపాడు మండలాలకు వారధిగా ఉన్న పాగేరు వంతెన 50 ఏళ్ల క్రితం నిర్మించారు. కేవలం పొలాలకు వెళ్లే రైతుల రాకపోకల కోసం అప్పటి ప్రభుత్వాలు నిర్మించాయి. అయితే ఏటూరు వద్ద పెన్నా, కుందూ నదులపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణంతో ఈ రహదారి రద్దీగా మారింది. కమలాపురం నుంచి ఖాజీపేట, మైదుకూరు, చాపాడు మండలాలకు వెళ్లే ప్రయాణికులు ఈ వంతెన పై నుంచే వెళ్లాలి. అలాగే ఎర్రగుంట్ల, తాడిపత్రి, బళ్లారి నుంచి వచ్చే భారీ వాహనాలు సైతం ఈ వంతెన పై నుంచే నంద్యాల, కర్నూలు, నెల్లూరు, హైద్రాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్తాయి. వరదలు వచ్చినప్పుడు వంతెన పూర్తిగా వరద నీటిలో మునిగిపోతుంది. అప్పుడు వాహనాలన్నీ కడప మీదుగా వెళ్లాల్సి వస్తుంది. దాదాపు 50 కి.మీ. అదనం. ఇంత ప్రాధాన్యత ఉన్న పాగేరు వంతెన దాదాపు పదేళ్ల క్రితం నుంచే శిథిలావస్థకు చేరింది. అయినా పాలకులు పట్టించుకోలేదు. వరదలు వచ్చి వంతెన కుంగినప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేస్తారు.. తర్వాత ఆ వంతెన గురించి పట్టించుకోరు. పాగేరు వంతెనను కూలగొట్టి దాని స్థానంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని వివిధ మండలాల ప్రజలు కోరుతున్నారు.

కోతకు గురవుతున్న పెన్నా కాజ్‌వే

కమలాపురం–చాపాడు మండలాలకు వారధిగా ఉన్న పెన్నా నదిపై నిర్మించిన కాజ్‌వే ప్రతి రెండేళ్లకో సారైనా కోతకు గురవుతోంది. గంగవరం, విభరాపురం, మొలకవారిపల్లె గ్రామాలకు చెందిన పలువురు రైతుల భూములు ఖాజీపేట, చాపాడు మండలాల పరిధిలో ఉన్నాయి. ఆ పొలాలకు వెళ్లాలంటే తప్పని సరిగా కాజ్‌వే దాటి వెళ్లాల్సిందే. వరదలు వచ్చినా, మైలవరం నీరు పెన్నా నదికి వదిలిన ఈ కాజ్‌వేకు తిప్పలు తప్పడం లేదు. తద్వారా రైతులు కూడా తమ పొలాలకు వెళ్లాలంటే కనీసం 20 కి.మీ. చుట్టూ తిరుక్కొని వెళ్లాల్సిందే. ఈ కాజ్ వే స్థానంలో కూడా హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు, రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎర్రవంకపై వంతెన నిర్మించాలి

మండలంలోని సి.గోవులాపురం–పాచికలపాడు గ్రామాల మధ్య ఉన్న ఎర్రవంకపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గొల్లపల్లె వంక నుంచి వచ్చే వరద నీరు ఈ వంక ద్వారా ప్రవహించి పాగేరు వంకలో కలుస్తాయి. వరదలు వచ్చిన ప్రతిసారి ఈ వంకపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన కుంగిపోవడం, కొట్టుకుపోవడం జరుగుతుందని, దీంతో ఈ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ప్రజా ప్రతినిధులు స్పందించి ఎర్రవంకపై లో లెవెల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలి



పాగేరు వంతెన చాలా పురాతనమైనది. గతంలో కేవలం రైతుల కోసం నిర్మించిన లో లెవెల్ వంతెన ప్రస్తుతం భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. ఈ వంతెన చూస్తే ఎప్పుడు కూలుతుందో, ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంగా ఉంటుంది. బళ్లారి, తాడిపత్రి, ఎర్రగుంట్ల తదితర ప్రాంతాల నుంచి భారీ వాహనాలు ఈ వంతెన పై నుంచే మైదుకూరు, నంద్యాల, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్తాయి. అధికారులు స్పందిచి పాగేరు వంకపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలి.

– నారనాయణరెడ్డి, విభరాపురం.

కాజ్‌వేకు శాశ్వత పరిష్కారం చూపాలి



కమలాపురం–ఖాజీపేట, చాపాడు మండలాలకు వారధిగా ఉన్న పెన్నా, కుందూ నదులపై ఏర్పాటు చేసిన కాజ్‌వే శాశ్వత పరిష్కారం చూపాలి. గంగవరం,విభరాపురం తదితర గ్రామాల రైతుల పొలాలు ఏటికి ఆవల వైపు రంగనాయకుల తువ్వ వైపు ఉన్నాయి. వరదల సమయంలో కాజ్‌వే తెగిపోతుంది. ఆ సమయాల్లో పొలాలకు వెళ్లాలంటే చుట్టూ 20కి.మీ. తిరిగి వెళ్లాలి. ప్రతి సారి తాత్కాలిక మరమ్మతులు చేపట్టే బదులు శాశ్వత పరిష్కారం చేయాలి. హైలెవెల్ బ్రిడ్జి నిర్మిస్తే దాదాపు 10 గ్రామాలకు పైగా ప్రయోజనం చేకూరుతుంది.

– ఖాదర్ హుసేన్, రైతు, కమలాపురం.

పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది



సి.గోవులాపురం–పాచికలపాడు గ్రామాల మధ్య ఉన్న ఎర్రవంకపై వంతెన నిర్మించాలి. వరదల సమయంలో ఎర్రవంకపై ఉన్న తాత్కాలిక నిర్మాణాలు కొట్టుకుపోతాయి. అపుడు వంక అటువైపు ఉన్న తమ పొలాలకు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితి. అలాగే ఈ గ్రామాల రాకపోకలు తెగిపోతాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఎర్రవంకపై లో లెవెల్ వంతెన నిర్మించాలి.

– నవనీశ్వర్ రెడ్డి, రైతు, సి.గోవులాపురం.

క్లుప్తంగా

వాల్మీకి జయంతిని విజయవంతం చేయండి

సింహాద్రిపురం : ఈనెల 17వ తేదీన జరిగే వాల్మీకి జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన విగ్రహ ప్రతిష్టను విజయవంతం చేయాలన్నారు. వాల్మీకుల చిరకాల వాంఛ ఎస్టీ పునరుద్ధరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఒక ప్రకటన విడుదల చేయాలని ఏపీ వాల్మీకి సంఘ కడప జిల్లా అధ్యక్షుడు సాకే ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం సింహాద్రిపురంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగా నిర్వహించాలని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈనెల 17వ తేదీన పులివెందులలో జరిగే వాల్మీకి జయంతి, విగ్రహ ప్రతిష్ట వేడుకలకు జిల్లాలోని వాల్మీకి సోదరులందరూ హాజరు కావాలన్నారు.

గ్రామాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయం

కమలాపురం : అన్నిగ్రామాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కోగటం పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. మండలంలో రూ.2.85 కోట్లతో సీసీ రోడ్లు, రూ.25లక్షలతో మూడు మెటల్ రోడ్లు, రూ.9.25లక్షలతో గోకులాలు నిర్మిస్తున్నామన్నారు. సంక్రాంతి నాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, పీఆర్, హౌసింగ్ ఏఈలు నిరంజన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ పార్థసారథి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


తెలూరులో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

తొండూరు : మండలంలోని పలు గ్రామాల్లో కొంతకాలంగా పారిశుద్ధ్యం పడకేసింది. సాక్షి దినపత్రికలో మంగళవారం 'పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు మండలంలోని తెలూరు గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయిస్తున్నారు. దీంతో గ్రామస్తులు అధికారులకు, సాక్షికి అభినందనలు తెలిపారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ పెద్దఓబన్న

తొండూరు : మండలంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం సాయంత్రం ఎస్ఐ పెద్దఓబున్న వాహనాల తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని తల్లిదండ్రులను హెచ్చరించారు. చట్టాలను ఉల్లంఘిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

నీటి సమస్యపై మున్సిపల్ చైర్మన్ ఆరా


నీటి సమస్య గురించి ఆరా తీస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో నెలకొన్న నీటి సమస్యపై మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆరా తీశారు. మంగళవారం బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉన్న గ్రామ సచివాలయ పరిధిలోని శ్రీకర్ ఫంక్షన్ హాలు రోడ్డు, తదితర ప్రాంతాలలో మున్సి పల్ కమిషనర్ రాముడుతో కలిసి ఆయన పర్యటించి నీటి సమస్య గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మెరుగైన సాగు పద్ధతులను అవలంబించాలి

కమలాపురం : మెరుగైన సాగు పద్ధతులను అవలంభించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని లేటపల్లె, పొడదుర్తి గ్రామాల్లో పొలం పిలుస్తోంది.. కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మెరుగైన సాగు పద్ధతులను అవలంబించి సాగు వ్యయాన్ని తగ్గించి రైతుల ఆదాయాలను పెంచడమే పొలం పిలుస్తోంది లక్ష్యం అన్నారు. అలాగే వ్యవసాయ అనుబంధ రంగాల సమాచారాన్ని, జ్ఞానాన్ని, నూతన పద్ధతులను వ్యవసాయ విస్తరణ సిబ్బంది ద్వారా రైతులకు అందజేస్తామన్నారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. 2024 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంట నమోదు జాబితాను మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ఏర్పాటు చేశామని, రైతులు సరి చూసుకోవాలన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ

వీరపునాయునిపల్లె : సాంఘీక సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన టీటీసీ, బీఈడీ అభ్యర్థులకు డీఎస్సీ శిక్షణ తరగతులు ఉచితంగా అందించనున్నట్లు కమలాపురం డివిజన్ సాంఘీక సంక్షేమ శాఖ అధికారిణి స్వర్ణలత తెలిపారు. మంగళవారం స్థానిక వసతి గృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులకు వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలు కలిగిన వారందరూ అర్హులని తెలిపారు. ఈనెల 21వ తేదీలోపు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అమ్మ పేరు మీద ఒక మొక్క నాటుదాం


అమ్మ పేరు మీద మొక్క నాటుతున్న ఆర్డీఓ భానుశ్రీ

పులివెందుల టౌన్ : అమ్మ పేరు మీద మొక్క నాటి జీవరాసులకు ఆక్సిజన్‌ను బహుమానంగా ఇద్దామని పులివెందుల ఆర్డీఓ భానుశ్రీ తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం, ఎన్ఎస్ఎస్, స్నేహిత అమృత హస్తం సేవా సమితిల ఆధ్వర్యంలో అమ్మ పేరు మీద ఒక మొక్క నాటుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. అబ్దుల్ కలాంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటి నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణులు నివేదిత, జయమ్మ, నజ్మా, పీడీ రాజశేఖర్, సాయి శ్రీనివాస్, సేవా సమితి అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చునని వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. మంగళవారం మండలంలోని కొండూరు, తుమ్మలూరు గ్రామ పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పని సరిగా చేయించాలన్నారు. ఏపంట సాగు చేస్తే అపంట మాత్రమే నమోదు చేయించాలన్నారు. అనంతరం పంట నమోదుపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఐ ఏఓ నీలానందం, వీహెచ్ఓ రెడ్డి భాను, రైతులు పాల్గొన్నారు.

ఇ–క్రాప్ నమోదు జాబితా ప్రదర్శన


రైతు సేవా కేంద్రాలలో ఇ-క్రాప్ నమోదు జాబితాను పరిశీలిస్తున్న ఏఓ రమేష్, తదితరులు

లింగాల : మండలంలోని రైతు సేవా కేంద్రాలలో ఇ–క్రాప్ నమోదు జాబితాను ప్రదర్శించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దకుడాల, కామసముద్రం, కోమన్నూతల రైతు సేవా కేంద్రాలలో ఇ–క్రాప్ నమోదు జాబితా ప్రదర్శన, సామాజిక తనిఖీ, గ్రామసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఏఓ రమేష్ హాజరై మాట్లాడుతూ మండలంలో ఇ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యిందని.. రైతుల అర్హుల జాబితాను అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శిస్తున్నామని.. ఈ జాబితాలపై రైతులకు అభ్యంతరాల స్వీకరణకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతుల వివరాలైన రైతుల పేర్లు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం, పంట సాగు తదితర వివరాలను ప్రదర్శించడం జరుగుతోందన్నారు. ఈ జాబితాను చూసుకుని నమోదులో ఎక్కడైనా పొరపాటు జరిగి ఉంటే వాటిని సరి చేసుకోవాలన్నారు. అభ్యంతరాలు ఉంటే రాతపూర్వకంగా తెలియజేస్తే ఈనెల 18వ తేదీ లోపు పరిష్కరిస్తామన్నారు. ఈ అభ్యంతరాల జాబితాను కూడా ఈనెల 18వ తేదీన తుది జాబితాను రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శిస్తామన్నారు. ఇ–క్రాప్ నమోదు తుది జాబితా ఆధారంగానే పంట నష్ట పరిహారం, పంటల బీమా, సున్నా వడ్డీ పంట రుణాలు వంటి వాటికీ అర్హత పొందుతారన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పని సరిగా పాటించాలి


రైతులకు సూచనలందిస్తున్న వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : పంటలు సాగు చేయు ప్రతి రైతు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నేలతిమ్మాయపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామాల్లో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు అందించారు. శనగ పంటలో ప్రధానంగా ఆశించే వేరుకుళ్లు, ఎండు తెగులు నివారణకు కారబాక్సిన్ థైరాం మందును వాడితే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. ఎన్ని రకాల ఎరువులు, పురుగు మందులు వాడినా ఆశించినంత దిగుబడి రాకపోవడానికి కారణం భూమిలో సేంద్రీయ కార్బణం లేకపోవడమేనన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్‌కుమార్, వ్యవసాయ సహాయకుడు సమర సింహారెడ్డి రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న జేడీఏ అయితా నాగేశ్వరరావు

వల్లూరు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నీటి మునిగిన పంటలను జాగ్రత్తలు పాటించి కాపాడుకోవాలని జేడీఏ అయితా నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం వల్లూరు మండలం బాలుగారిపల్లెలోని వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగిన పంటలను జాగ్రత్తలు పాటించి కాపాడు కోవాలన్నారు. పొలాలలో నీరు నిల్వ లేకుండా మురుగు నీరు తొలగించాలన్నారు. వర్షం తాకిడికి నేలకొరిగిన కుదుళ్లను నిలబెట్టి గుంపులుగా కట్టి గింజ మొలకెత్త కుండా, రంగు మారకుండా లీటర్ నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే వరిలో పాము తెగులు కూడా ఎక్కువగా ఆశించే వీలుంది కాబట్టి వర్షం తగ్గిన వెంటనే 2మి.లీ.హెక్సకోనజోల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సురేఖ, రైతులు పాల్గొన్నారు.

తాగండి...తాగి ఊగండి అన్నదే ప్రభుత్వ సిద్ధాంతం

వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి


మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్: తాగండి...తాగి ఊగండి అన్నదే ప్రభుత్వ సిద్ధాంతంగా ఉందని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి. నరేన్ రామాంజులరెడ్డి విమర్శించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పదిహేను రోజులుగా మద్యం పాలసీ, దాని అమలు తీరుపై కూటమి ప్రభుత్వం చేస్తున్నదానిపై ఆనందపడాలో, బాధపడాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఏ ప్రభుత్వానికైనా మద్యం ఆదాయవనరు మాత్రమేనని, కూటమి ప్రభుత్వం దానిని ప్రవేశపెట్టిన తీరు సరిగా లేదన్నారు. ప్రజల జీవనాడిని దెబ్బ తీసేలా, లిక్కర్ సిండికేట్‌ను ప్రోత్సహించేలా మద్యం పాలసీ ఉందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక దాన్ని పూర్తిగా మర్చిపోయిందన్నారు. తెలంగాణలో 2వేల పైచిలుకు షాపులకు లక్షా యాభైవేల దరఖాస్తులు వస్తే, మన రాష్ట్రంలో మూడు వేల మూడు వందల షాపులకు కేవలం 80వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. మద్యం షాపుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం తేవాలన్న ముఖ్యమంత్రి విజన్‌కు ఆ పార్టీ నాయకులే తూట్లు పొడిచారన్నారు. అడ్వర్‌టైజ్‌మెంట్ చేయడంలో సీఎం చంద్రబాబును మించిన వారు లేరని, రూ.99లకే నాణ్యమైన మద్యం అని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం...ప్రజలు దానిని తాగి అనారోగ్యబారిన పడితే వారి లివర్లు, కిడ్నీలకు ఏదైనా ప్యాకేజీ ప్రకటిస్తుందా అని ఎద్దేవా చేశారు. ఈ మద్యం తాగి అనారోగ్య బారిన పడిన వారికి ప్రభుత్వం పూచీకత్తు ఏమైనా ఇస్తుందా .. అని ప్రశ్నించారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, వైద్యం, పౌష్టికాహారం వంటి ధరలు ఆకాశాన్నంటుతుంటే, ఒక్క మద్యం మాత్రమే సరసమైన ధరలకు ఇస్తే సరిపోతుందా అని నిలదీశారు. విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికే పులివెందుల మెడికల్ కళాశాలకు మెడికల్ సీట్లు వద్దని లేఖరాశారని, ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోవాల న్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జీఎస్ భాస్కర్‌రెడ్డి, చీర్ల సురేష్ యాదవ్, జి. శ్రీనివాసులరెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు శంకుస్థాపన


సింహాద్రిపురంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బీటెక్ రవి


జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి


ఉరుటూరులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చైతన్యకుమార్‌రెడ్డి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : మండలంలో పల్లె పండుగ వారోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం కొలుములపల్లె గ్రామ పంచాయతీలో నాలుగు సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులకు మండల అభివృద్ధి అధికారి కుళాయిబాబు శంకుస్థాపన చేశారు. సాయంత్రం రసూల్‌పల్లె పంచాయతీలో రెండు సిమెంటు రోడ్ల పనులకు సర్పంచ్ జి.స్వాతి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో ఈఓపీఆర్‌డీ వెంకట సుబ్బారెడ్డి, స్థానిక సర్పంచ్ స్వాతి, పంచాయతీ కార్యదర్శులు నారాయణ రెడ్డి, సిద్దేశ్వర్, ఉపాధి ఏపీఓ రామాంజులరెడ్డి, సిబ్బంది, స్థానిక నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : కామసముద్రం, పెద్దకుడాల పంచాయతీల గ్రామాల్లో మంగళవారం అధికారులు పల్లె పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధికారులు సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. పీఆర్ ఏఈ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కామసముద్రం పంచాయతీలో రెండు పనులకు రూ.6.13 లక్షలు, పెద్దకుడాల పంచాయతీ గ్రామాల్లో రూ.7.80 లక్షలు ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్స్ నిధులతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : పల్లె పండుగ వారోత్సవాలు పురస్కరించుకుని సింహాద్రిపురంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి మాట్లాడారు. సింహాద్రిపురంలోని ఓ వీధిలో రూ.12లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండలంలోని చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మేకలబాలయపల్లె, ఇల్లూరు, తదితర గ్రామాల్లో ఎంపీడీఓ రమణ ఆధ్వర్యంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇల్లూరు గ్రామంలో రూ.9 లక్షల అభివృద్ధి పనులు శంఖుస్థాపన చేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : మండలంలోని మోరగుడి గ్రామంలో రూ.24 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి, ఎంపీడీఓ రహమన్నితున్నిసా, సర్పంచ్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరులో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉరుటూరు గ్రామంలో ఆయన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని 22 పంచాయతీలకు రూ.3 కోట్ల 44లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి చంద్రమౌళీశ్వర్, ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : గ్రామాల అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు. మంగళవారం మండలంలోని అచ్చివెళ్లి, కనంపల్లె, పుత్రాయునిపేట గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో నూతనంగా నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు.

సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.